వచ్చే పదేళ్లూ రేవంత్‌రెడ్డే సీఎం



వడ్డెర సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న దానం నాగేందర్

దానం నాగేందర్

లాలాపేట: రాష్ట్రంలో పదేళ్లపాటు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని మాణికేశ్వర్‌నగర్‌లో త్వరలో రూ. 50 కోట్లతో ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణం చేస్తామని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. మాణికేశ్వర్‌నగర్‌లో ఇటీవల నూతనంగా నిర్మాణం చేసిన శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ భవనాన్ని శుక్రవారం ఆయన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా మాణికేశ్వర్‌నగర్‌లో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ సమస్య, ఓయూ క్యాంపస్‌లోని తొమ్మిది బస్తీల సమస్యలను ఈ పార్లమెంట్ ఎన్నికల అనంతరం పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు. దీంతో పాటు వడ్డెర్లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు విషయమై త్వరలో వడ్డెర్లతో సీఎం రేవంత్‌రెడ్డి కలిసి మాట్లాడుదామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ గండికోట వడ్డెర సొసైటీ అధ్యక్షులు కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి కిరణ్, సలహాదారులు వెంకటేష్, యాదయ్య, గిరి, నాయకులు ఆదం సంతోష్, వేముల శ్రీనివాస్, లాజరస్, లింగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

అడ్డగుట్ట: బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ మంద అశ్విని కాంగ్రెస్ పార్టీలో చేరారు. అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన మంద అశ్విని సురేష్ దంపతులు పలువురు పార్టీ నేతలతో వెళ్లి కాంగ్రెస్ సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్‌ను కలిసి పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ గూటికి చేరుతున్నారని ఈ సందర్భంగా దానం నాగేందర్ పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో నరేందర్, సందీప్, నవీన్, గణేష్, శివ, రవి, అనిత, సరిత, రాజు, సాంబ, మౌనిక, వంశి, వినోద్, లలిత ఉన్నారు.

కిషన్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ ప్రచారం

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా శుక్రవారం ఎమ్మార్పీఎస్, బీజేపీ నాయకులు బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, ఆనంద్‌రావు, విష్ణు, టీవీ నరసింహారావు, కుమార్ బాబు, అమర్, సుచేంద్ర, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి గంధమాల స్పందన, నరేందర్, శ్రీనివాస్, సురేష్ బండమైసమ్మనగర్, బీజేఆర్ నగర్ తదితర బస్తీల్లో పర్యటించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తుది దశకు చేరుకుందని ఎస్సీ వర్గీకరణ కోసమే మంద కృష్ణ మాదిగ బీజేపీకి మద్దతు ఇస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మోసం చేశాయని ఈ పార్టీలు గెలుస్తే మాదిగలకు ఎలాంటి న్యాయం జరగదన్నారు.



కరపత్రాలను పంపిణీ చేసిన నాయకులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వ్యక్తిగత నిధులతో పునఃనిర్మించిన పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే తలసాని హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎంతో చరిత్ర గల ఆలయ అభివృద్ధి, పునర్నిర్మాణం, కోసం సహకరించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, నాయకులు శ్రీహరి, డివిజనల్ సెక్రటరీ ఆరిఫ్, అశోక్, అబ్బాస్, వహీద్, సాజిద్, ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓయూలో ప్రపంచ మేధోసంపత్తి హక్కుల దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ లా కాలేజీలో ప్రపంచ మేధోసంపత్తి హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం కాలేజీ సెమినార్ హాల్లో డీపీఐఐటీ ఐపీఆర్–చైర్, ఓయూ ఐపీఆర్ సెల్, టీఎస్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్ కాస్ట్) ఆధ్వర్యంలో ఐపీ అండ్ ద ఎస్‌డీజీలు బిల్డింగ్ అవర్ కామన్ ఫ్యూచర్ విత్ ద ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటి అనే అంశం పై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి లా కాలేజీ సీనియర్ ప్రొఫెసర్.జీబీ రెడ్డి అధ్యక్షత వహించగా ఐఎఫ్ఎస్ అధికారి శ్రీలక్ష్మి హాజరై మాట్లాడారు. సుస్థిర అభివృద్ధిలో మేధో సంపత్తి హక్కులు కీలకమన్నారు. జనీవాలో 1970 ఏప్రిల్ 26న ప్రపంచ మేధో హక్కుల చట్టాన్ని ఆమోదించారని, 2000 సంవత్సరం నుంచి ఏప్రిల్ 26న ప్రపంచ వ్యాప్తంగా మేధో హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని ప్రొ.జీబీ రెడ్డి వివరించారు. ప్రతి ఏటా ఒక్కొక్క అంశం పై నిర్వహిస్తున్న ప్రపంచ మేధో హక్కుల దినోత్సవాన్ని ఈ ఏడాది సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, మేధో సంపత్తి హక్కుల పాత్ర అనే అంశం పై జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ ప్రొ.రాధిక యాదవ్, లా డీన్, హెడ్ ప్రొ.విజయలక్ష్మి, సీనియర్ న్యాయవాది అశోక్ రామ్‌కుమార్, సుఖ్‌దేవ్ కాటమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొ.జీబీ రెడ్డి

విశ్వవిద్యాలయాలు.. పరిశోధనలకు నిలయాలు

పద్మభూషణ్ డా.సారస్వత్

ఉస్మానియా యూనివర్సిటీ: విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు నిలయాలని నిత్యం కొత్త విషయాల దిశగా అన్వేషించాలని నీతి ఆయోగ్ సభ్యులు, డీఆర్‌డీవో విశ్రాంత డీజీ, పద్మభూషణ్, ఓయూ పూర్వ విద్యార్థి, డాక్టర్ విజయ్ కుమార్ సారస్వత్ అన్నారు. శుక్రవారం ఓయూ 107 ఫౌండేషన్ డే సందర్భంగా వర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాలేజీల్లో విద్యా ప్రయాణం మాత్రమే ఉంటుందని వర్సిటీల్లో ఎంచుకున్న రంగంలో నాణ్యత ప్రమాణాలతో కూడిన పరిశోధనలు జరగాలన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో వివిధ అంశాలపై జరిగే పరిశోధనలు సమాజంపై ప్రభావం చూపాలని సమాజంలోని అశాస్త్రీయ అంశాల ప్రభావం వర్సిటీలపై పడకూడదన్నారు. దేశ ఆర్థిక, సామాజిక, విజ్ఞానాభివృద్ధి తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యా సంస్థలు పరిశ్రమలు, లాబోరేటరీలతో కలిసి పరిశోధనలు మరింత పెంచాలన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యారంగానికి ఓయూ గురువులాంటిదని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఓయూ పూర్వ విద్యార్థి బుర్రా వెంకటేశం పేర్కొన్నారు. టాలెంట్, ట్రైనింగ్, టెక్నాలజీ, ట్రెడిషన్ నాలుగు టీలను అనుకరిస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. ఓయూ ఫౌండేషన్ సందర్భంగా మూడు రోజులు జరిగిన కార్యక్రమాలలో భాగంగా ఈ నెల 25న నిర్వహించిన ఓపెన్ డేకు నగరంతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50 వేల మంది విద్యార్థులు వర్సిటీని సందర్శించి వివిధ అంశాలను తెలుసుకున్నట్లు వీసీ ప్రొ.రవీందర్ పేర్కొన్నారు. అమెరికాలోని ఇమాజియా కార్పొరేషన్ సీఈవో, ఓయూ పూర్వ విద్యార్థి వీణ గుండవల్లి, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, డీన్ ప్రొ.మల్లేశం పాల్గొని ప్రసంగించారు. అనంతరం వీసీ ప్రొ.రవీందర్ రచించిన పుస్తకాన్ని, రాకేష్ శర్మ ప్రసంగ పుస్తకాన్ని ఆవిష్కరించారు.



విజయ్‌కుమార్ సారస్వత్‌ను సన్మానిస్తున్న వీసీ, తదితరులు



హాజరైన విద్యార్థులు



స్లిప్పులు ఇస్తున్నాం.. ఓటును స్కిప్ చేయొద్దు!

- ఓటరు చిట్టీల పంపిణీ షురూ
- పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కసరత్తు
- 80 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి నుంచే ఓటేసే అవకాశం

సనత్‌నగర్: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు అధికారులు తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గత మూడు పర్యాయాలు పోలింగ్ శాతం 60 శాతం దాటలేదు. ఏడాది ఏడాదికి పోలింగ్ శాతం తగ్గుతూ వస్తుండటం గమనార్హం. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గంలో 56.45 శాతం పోలింగ్ జరగ్గా, 2018లో 52 శాతానికి పడిపోయింది. 2023లో జరిగిన ఎన్నికల్లో 51.86 శాతం పోలింగ్ జరిగింది. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎలాగైనా పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే వివిధ రూపాల్లో ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాలను చేపడుతూ వచ్చారు. ఓటర్లు ఎలాంటి అయోమయానికి గురికాకుండా స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించారు. మే 2 వరకు పంపిణీని పూర్తి చేయాలనే లక్ష్యాన్ని బీఎల్‌ఓలకు నిర్దేశించారు. నియోజకవర్గంలో ఫిబ్రవరి 8న విడుదలైన తుది జాబితా ప్రకారం సనత్‌నగర్ నియోజకవర్గంలో 2,52,530 మంది ఓటర్లకు 229 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు.

స్లిప్పులపై జీపీఎస్ మ్యాప్

ఓటరుకు సంబంధించిన వివరాలతో పాటు సదరు ఓటరు ఎక్కడ ఓటు వేయాలో తెలియజేసే పోలింగ్ బూత్, ఆ బూత్ ఉన్న భవనం వివరాలతో కూడిన స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. ఇదే క్రమంలో పోలింగ్ బూత్, లొకేషన్ వివరాలతో కూడిన స్లిప్పుల వెనుక జీపీఎస్ మ్యాప్‌ను కూడా ముద్రించారు. దీని ఆధారంగా పోలింగ్ బూత్ లొకేషన్‌ను సులువుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. స్లిప్పుల పంపిణీ అనంతరం ఓటరు ఫోన్ నెంబర్‌ను సేకరిస్తున్నారు. ఆయా ఫోన్ నెంబర్ల ఆధారంగా పోలింగ్ రోజు నాటికి మరింత చైతన్యం తీసుకువచ్చేలా ఎస్ఎంఎస్‌ల ద్వారా అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.



ఓటరు స్లిప్పులను అందజేస్తున్న సిబ్బంది

ఇంటి నుంచే..

85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంట్లోనే ఓటేసే అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే బీఎల్‌ఓలకు దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రం వద్దకు రాలేని వారిని ముందుగానే గుర్తించే బాధ్యతలను బీఎల్‌ఓలకు అప్పగించారు. ఒకవేళ రాలేని పరిస్థితిలో ఉన్నవారికి ఫామ్12–డీ అందజేసి పూరించిన ఫామ్‌లను అందజేశారు. అయితే 15 మంది మాత్రమే దరఖాస్తు చేసుకోగా అందులో 2 తిరస్కరణకు గురయ్యాయి. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు పోలింగ్ రోజున ఎన్నికల అధికారి, పోలీస్ సిబ్బంది కలిగిన బృందం వెళ్లి బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటు వేయించి తీసుకొస్తారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో కూడా తీస్తారు.

పోలింగ్ పెంచడమే లక్ష్యం..



ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఎన్నికల కమిషన్ తరుపున పోలింగ్ శాతం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. బీఎల్‌ఓలకు దిశా నిర్దేశం చేశాం. ఆ మేరకు ఓటర్లను చైతన్యపరుస్తున్నాం. ఓటరు స్లిప్పులను పంపిణీని మొదలుపెట్టాం. మే 2 వరకు పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించాం.

–సమ్మయ్య, ఏఆర్ఓ

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని వినాయక ఆలయంలో ప్రత్యేక పూజాద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాస రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతిహోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృత అభిషేకం ఉంటాయన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

బౌద్ధనగర్: బీజేపీ సికింద్రాబాద్ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా అంబర్‌పేట్‌లోని బతుకమ్మ కుంట వద్ద నిర్వహించనున్న గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ ఓ ప్రకటనలో కోరారు. ఆదివారం(రేపు) మధ్యాహ్నం 12 గంటలకు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్ హాజరవుతారన్నారు.

మహంకాళి అమ్మవారికి పూజలు



పూజలు చేస్తున్న రవిశేఖర్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి రవి శేఖర్‌రెడ్డి సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మూడో వార్డులో నివేదిత ప్రచారం



రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మూడో వార్డు బాలంరాయి, సుభాష్ హట్స్, 40 క్వార్టర్స్, అంబేడ్కర్ సొసైటీ, ఈద్గా అంబేడ్కర్ నగర్ బస్తీల్లో బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత సాయన్న శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఒక ఓటు మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో పాటు తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ముప్పై ఏళ్ల పాటు తన తండ్రి సాయన్న ప్రజల కోసం నిరంతరం పాటు పడ్డారని.. తాను సైతం అదే బాటలో నడుస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు నివేదితకు అండగా ఉంటామని కారు గుర్తుపై ఓటేసి గెలిపిస్తామని హామీ ఇచ్చారు. తమ బస్తీలో బీఆర్ఎస్ హయంలోనే రోడ్లు, వీధీ దీపాలు, పవర్‌బోర్‌వెల్స్, తాగు నీటి పైపులైన్లు అభివృద్ధి జరిగిందని బస్తీవాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజు సింగ్, సాయికిరణ్, సుదర్శన్, అశోక్, శేఖర్, రాకేష మాదిగ పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తా

బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు



పద్మారావుకు హారతి ఇస్తున్న మహిళలు

చిలకలగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. స్థానిక కార్పొరేటర్ సునీతతో కలిసి ఆయన శుక్రవారం మెట్టుగూడ డివిజన్‌లోని డీబీఆర్, ఎస్‌వీఎస్ గల్లీ, పాండవులబస్తీ, దూద్‌బావి, పార్థివాడ, చింతబావి ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మెట్టుగూడ అనేక విధాలుగా అభివృద్ధి చెందిందని, స్థానికుల నుంచి విశేష స్పందన వస్తుందని, హారతులు పట్టి స్వాగతం పలుకుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సికింద్రాబాద్‌తో పాటు అత్యధిక సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో అసెంబ్లీ ఇన్‌చార్జీ రాజీవ్‌సాగర్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్న లక్ష్మీ, యువజన విభాగ నాయకులు రామేశ్వరగౌడ్, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

జేఈఈలో నారాయణ సత్తా



లక్డీకాపూల్ : జేఈఈ–2024 మెయిన్ ఫలితాలలో ఎస్ఆర్‌నగర్ నారాయణ కాలేజీ విద్యార్థి రోహన్ సాయి పబ్బా 300/300 మార్కులు సాధించి ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 12 వ ర్యాంకు సాధించాడు. వీటితో పాటు అన్ని కేటగిరిలలో 1000 లోపు 5, 5000 లోపు 19, 10000 లోపు 43, 15000 లోపు 73, 20000 లోపు 83, 30000 లోపు 127 మంది విద్యార్థులు ర్యాంకులు సాధిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల కోర్ డీన్ సుబ్బా రెడ్డి, డీన్స్ శ్రీనివాస రెడ్డి, బీవీరాజు, ఏజీఎమ్ బాలాజీ, ప్రిన్సిపాల్ రవిశంకర్ ప్రసంసించారు.

కంప్యూటర్ హ్యాక్‌చేసి.. నకిలీ సర్టిఫికెట్లు తయారు చేసి


యువకుడి అరెస్టు

అమీర్‌పేట: ఆసుపత్రి కంప్యూటర్లను హ్యాక్ చేసి నకిలీ అనుభవ పత్రాలను తయారు చేస్తున్న యువకుడిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. అమీర్‌పేటలోని మెడికవర్ ఆసుపత్రిలో మహారాష్ట్రకు చెందిన 23 ఏళ్ల సిద్దేశ్వర్ సురాతే ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆసుపత్రి కంప్యూటర్లను హ్యాక్ చేస్తున్నాడనే అనుమానంతో అతడి బ్యాగును తనిఖీ చేయగా ఆసుపత్రి పేరుతో ఉన్న లెటర్ హెడ్‌లు, స్టాంపులు, నకిలీ సంతకాల స్టాంపులు లభ్యమయ్యాయి. నిందితుడు తన ప్రియురాలికి సైతం నకిలీ అనుభవ ధ్రువపత్రాలు ఇచ్చినట్లు గుర్తించారు. హెచ్ఆర్ మేనేజర్ కుసుమ ఫిర్యాదు మేరకు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నగల వ్యాపారిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

అమీర్‌పేట: నగల వ్యాపారిని మోసం చేసిన వ్యక్తిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. బీకేగూడ బాలయ్యనగర్‌లోని రామ్‌దేవ్ నగల దుకాణానికి పది రోజుల క్రితం శ్రవణ్‌కుమార్ అనే వ్యక్తి వచ్చి రూ.44 వేలు విలువచేసే చెవి రింగులను కొనుగోలు చేశాడు.డబ్బు మొత్తాన్ని షాపు యజమానికి ఫోన్ పే ద్వారా చెల్లించినట్లు సేల్స్‌మెన్ లక్ష్మణ్‌సింగ్‌కు స్క్రీన్ షాట్ చూపి వెళ్లిపోయాడు. కాసేపటికి దుకాణానికి వచ్చిన యజమానిని ఫోన్‌పేలో డబ్బులు వచ్చాయని లక్ష్మణ్ సింగ్ అడిగాడు. ఎలాంటి డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మూసాపేటలో మరో నగల దుకాణానికి వెళ్లడంతో అక్కడి సిబ్బంది గుర్తించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయ ఆలయ 71వ జయంతి వార్షిక వేడుకల్లో భాగంగా నాల్గవ రోజైన శుక్రవారం ధన అలంకరణలో స్వామివారు దర్శమిచ్చారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. –చిలకలగూడ



నేడు 'రాజ్యాంగ విలువలు– ప్రజాస్వామ్యం సవాళ్లు'పై సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: రాజ్యంగ విలువలు– ప్రజాస్వామ్య సవాళ్లు, పౌరుల పాత్ర అనే అంశంపై నేడు (27న) సదస్సు జరగనుంది. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ 121వ తరగతి గదిలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి జేఎన్‌యూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.యోగేంద్ర యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నట్లు రిసెర్చ్ స్కాలర్ నెల్లి సత్య పేర్కొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



సీపీ శ్రీనివాస్ రెడ్డిని సన్మానిస్తున్న వీసీ, ప్రొఫెసర్లు

ఉస్మానియా యూనివర్సిటీ: మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా లభిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కామర్స్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు ప్రొ.అప్పారావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసి రెండు రోజుల జాతీయ సదస్సుకు సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి, వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ప్రొ.చెన్నప్ప, ప్రొ.నరేష్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ

అమీర్‌పేట: సీఏ, సీఎంఏ, సీయాఐటీ, సీఎల్ఏటీ, ఐపీఎంఏటీ వంటి పోటీ పరీక్షలకు హాజరవుతున్న ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు 3 నెలల పాటు షార్ట్, లాంగ్ టర్మ్ ద్వారా ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు సీఎంఎస్ విద్యా సంస్థల ఛైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు.శుక్రవారం సాయంత్రం ఎస్ఆర్‌నగర్‌లోని కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అతి తక్కువ సమయంలోనే ఉన్నత స్థాయికి చేరుకోగల కామర్స్ రంగంలో ఉద్యోగల అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. కామర్స్ విభాగంలో విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఆసక్తిని ఉన్న వారు 9573997799, 9573992299 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పుస్తకాలు తీసుకుంటేనే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇస్తాం

రాంగోపాల్‌పేట్: రోజు రోజుకు ప్రైవేటు పాఠశాలల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఓ వైపు రూ. లక్షల్లో వసూళ్లు చేస్తున్న యాజమాన్యాలు మరోవైపు పుస్తకాల పేరుతో మరో దోపిడీకి తెర లేపుతున్నారు. రెజిమెంటల్‌బజార్‌లోని ఓ యాజమాన్యం ఏకంగా వేసవి సెలవులు మొదలు కాక ముందు నుంచే పుస్తకాలు తీసుకోవాలని లేకపోతే ప్రోగ్రెస్ రిపోర్టు ఇవ్వమంటూ విద్యార్థులపై ఒత్తిడి పెంచింది. ఇప్పుడు వేసవి సెలవులు మొదలైనా పుస్తకాలు కొనని వారికి ప్రోగ్రెస్ రిపోర్టులు ఇవ్వలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పని పరిస్థితుల్లో వారు చెప్పిన ధరలకు పుస్తకాలు కొనాల్సి వస్తుంది. పుస్తకాలు కొన్నట్లు రసీదును సంబంధిత ఉపాధ్యాయుడికి చూపిస్తేనే ప్రోగ్రెస్ రిపోర్టు ఇస్తున్నారు. బయటి మార్కెట్‌లో రూ.1500కు దొరికే పుస్తకాలు ఇక్కడ ఏకంగా రూ.4వేలకు విక్రయిస్తుండటం గమనార్హం.ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలకు తావిస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రజాజీవనానికి ఆటంకం కలిగించిన ఇద్దరికి జైలు



చిలకలగూడ : వేర్వేరు ఘటనల్లో ప్రజాజీవనానికి ఆటంకం కలిగించడంతోపాటు దాడులకు పాల్పడుతున్న ఇరువురికి జైలుశిక్ష విధించారు. చిలకలగూడ సీఐ అనుదీప్, ఎస్ఐ బాలరాజు, నరేష్ వివరాల ప్రకారం.. పద్మారావునగర్ హమాలీబస్తీకి చెందిన డీ.నర్సింగ్ (43), బాగ్ లింగంపల్లికి చెందిన కే. నర్సింగ్ (32) ఈ నెల 25న హమాలీ బస్తీ, సీతాఫల్‌మండి టీఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతాల్లో మద్యం మత్తులో వేర్వేరుగా పబ్లిక్ న్యూసెన్స్ చేయసాగారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడ్డారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకుని ఈ–పెట్టీ కేసు నమోదు చేసి శుక్రవారం సికింద్రాబాద్ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పర్చగా ఇరువురికి పది రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి రవిశంకర్ తీర్పునిచ్చారు.

ఆధారాలు లేని రూ.17.80లక్షలు స్వాధీనం

రాంగోపాల్‌పేట్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.17.80 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మార్కెట్ పోలీసులు ఎన్నికల సందర్భంగా గురువారం సాయంత్రం మోండా సుభాష్‌రోడ్‌లోని ఆషా పాన్‌షాప్ వద్ద వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో నిర్మల్ జువెలర్స్‌కు చెందిన సిబ్బంది సంతోష్, కృష్ణ ద్విచక్ర వాహనంపై వెళ్తుండుగా ఆపి తనిఖీ చేయగా రూ.18.80లక్షలు ఉన్నాయి. వీటికి సంబంధించిన పత్రాల గురించి పోలీసులు విచారించగా ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో నగదును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి పరామర్శ

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట వినోభానగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు శుక్రవారం వెళ్లి సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించారు. చేయూతగా 25 కిలోల బియ్యం బస్తాను అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, ఆటో డ్రైవర్లు అలీమ్ భాయ్, వేణు, శ్రీనివాస్, రాజు, భిక్షపతి, ప్రవీణ్, సురేష్ పాల్గొన్నారు.

